

జిల్లాల వారీగా సగటు వర్షపాతం..

జిల్లా	ఆదివారం	సోమవారం
మహబూబాబాద్	29.67 సెం.మీ	39.40మి.మీ
వరంగల్	15.10 సెం.మీ	53.05మి.మీ
ములుగు	11.30 సెం.మీ	42.20మి.మీ
హనుమకొండ	6.95 సెం.మీ	37.10మి.మీ
జనగామ	5.70 సెం.మీ	0.80మి.మీ
భూపాలపల్లి	2.70 సెం.మీ	28.20మి.మీ





మహబూబాబాద్ మున్నేరు వాగు వద్ద దెబ్బ తిన్న రోడ్డు



ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఇందిరానగర్‌లో పొలాల్లో ఇసుకమేటలు



భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో నీట మునిగిన పత్తి చేను



జనగామ మండలం గానుగుపహాడ్ శివారులో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్



కేసముద్రంలో ధ్వంసమైన వెంకటగిరి రోడ్డు



నెక్కొండ మండలంలో దెబ్బతిన్న పత్తిపంట

వాన బీభత్సం.. తీరని నష్టం

- భారీ వర్షంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అతలాకుతలం
- వరదకు దెబ్బతిన్న పంటలు, రోడ్లు
- పొలాల్లో ఇసుక మేటలతో రైతుల కన్నీళ్లు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

భారీ వర్షాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీభత్సం సృష్టించడంతో తీరని నష్టం మిలిగింది. అనేక చోట్ల వాగులు, వంకలు చెరువులు ఉప్పొంగడంతో పాటు వరద తీవ్రతకు పలుచోట్ల పంటలు నీట మునిగాయి. పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. అనేక చోట్ల వాగులపై వంతెనలు, అంతర్గత, ప్రధాన రహదారులు ధ్వంసమయ్యాయి. చెరువు కట్టలు తెగిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు భారీ నష్టమే వాటిల్లింది.

▸▸ మహబూబాబాద్ జిల్లాలో సుమారు 27,639 ఎకరాల్లో పంటలు నీటిపాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో 1,590చెరువులు ఉండగా అందులో 53చెరువుల కట్టలు తెగిపోయాయి. పాలేరు, ఆకేరువాగులపై మూడు చెక్‌డ్యాంలు కొట్టుకుపోగా, వరద ఉధృతి తగ్గితే మరికొన్ని బయటపడే అవకాశం ఉంది. అలాగే జిల్లా వ్యాప్తంగా 15ప్రాంతాల్లో అర్‌అండ్‌బీకి చెందిన అనేక రోడ్లు కోతకు గురయ్యాయి. సుమారు 28వేల ఎకరాలు నీటమునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక నిర్ధారణ కొచ్చినట్టు తెలుస్తోంది. మహబూబాబాద్ పట్టణంలో వర్షబీభత్సంతో దెబ్బతిన్న రోడ్లను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి పరిశీలించారు. వారి వెంట అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఆర్డీవో అలివేలు, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మున్నెరు వాగు వద్ద విరిగిన విద్యుత్ స్తంభాలను టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. జిల్లాలో 400 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, కొన్నిచోట్లఫీడర్ చానళ్లు దెబ్బతిన్నాయని, 11 సబ్ స్టేషన్‌లలోకి నీళ్లు వచ్చాయని, పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఆయన వెల్లడించారు. మహబూబాబాద్ మండలం రాళ్లవాగులో ఆదివారం రాత్రి డీసీఎం వ్యాను కొట్టుకుపోయిన ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన నాగభూషణం అచూకీ ఇంత వరకు లభించలేదు. తొర్రూరు మండలం వెంకటపురం వాగులో గల్లంతైన వ్యక్తి చిన్న సోమయ్య మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికితీశారు.

▸▸ రెండురోజుల పాటు కుండపోత వాన తీవ్ర నష్టాన్ని మిగల్చగా.. సోమవారం మోస్తరు జల్లులు మాత్రమే పడ్డాయి. దీంతో ములుగు జిల్లా తేరుకుంటోంది. వరదల భయంతో బిక్కుబిక్కుమన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వాగుల ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతున్నా వందలాది మంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. తాడ్వాయి మండలం మొండెలతోగు, జలగలంచ వద్ద జాతీయ రహదారి వరదలకు ధ్వంసం కావడంతో శనివారం సాయంత్రం

▸▸ మిగతా 7వ పేజీలో..




హనుమకొండ బస్టాండ్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు

నేడు మహబూబాబాద్ జిల్లాకు
సీఎం రేవంత్‌రెడ్డి
మరిపెడ, నెల్లికుదురు మండలాల్లో సందర్శనకు ఏర్పాట్లు

మహబూబాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో అతలాకుతలమైన మహబూబాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నారు. సోమవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న అయన తిరుగు ప్రయాణంలో మహబూ బాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న జిల్లా అధికార యంత్రాంగానికి మరిపెడ, నెల్లికుదురు మండలాల్లోని వరద బీభత్స ప్రాంతాల్లో సీఎం సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. భారీ వర్షంతో మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం హైలెవల్ వంతెనకు ఇరువైపులా అప్రోచ్‌రోడ్డు కొట్టుకుపోవడంతో ఈ దారిలో రాకపోకలు స్తంభించాయి. మరోపక్క నెల్లికుదురు మండలం రావిరాలలో చెరువు తెగడంతో తీవ్రంగా పంటల నష్టం వాటిల్లింది. ఈ రెండు గ్రామాల్లో సీఎం పర్యటించనున్నారు.

నీటమునిగిన పంటలు.. కొట్టుకుపోయిన బ్రిడ్జి

జిల్లాలో భారీ వర్షంతో అపార నష్టం వాటిల్లింది. అధికారుల ప్రాథమిక నివేదిక మేరకు దాదాపు 28వేల ఎకరాలు నీట మునిగాయి. 15 ప్రధాన రోడ్లు కోతకు గురయ్యాయి. మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం వెళ్లే రోడ్డులోని ముల్కలపల్లి హైలెవల్ వంతెన 8 పిల్లర్ల మీద స్లాబ్ కొట్టుకుపోయింది. మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం, ఉగ్గంపల్లి హైలెవల్ వంతెనలకు ఇరువైపులా అప్రోచ్‌రోడ్లు కొట్టుకుపోవడంతో మరిపెడ, సూర్యాపేట, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి మహబూ బాబాద్‌కు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం వర్ష బీభత్స ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించి పరిస్థితిని రేవంత్‌రెడ్డికి వివరించిన క్రమంలో సీఎం మహబూబాబాద్ జిల్లాలో పర్యటించాలని నిర్ణయించుకున్నారని సమాచారం.





ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న యంత్రాలు

యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ మరమ్మతులు

- ఇంటికన్నె వద్ద రైల్వే ట్రాక్ వేలాడుతున్న ప్రాంతంలో 8 ప్రొక్లెయినర్లతో వేగంగా పనులు
- పరిశీలించిన రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

వివరాలు : 7లో..

అధైర్యం వద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

- అధికారులు సేవా దృక్పథంలో పనిచేయాలి
- ముందస్తు ప్రణాళికతో తగ్గిన నష్టం
- ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలి
- ముంపు ప్రాంతాల పర్యటనలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



కేసముద్రంలో ముంపు బాధితులను ఓదార్చుతున్న మంత్రి సీతక్క

గ్రామస్థులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్
- రావిరాలలో నిత్యావసర సరుకుల అందజేత



రావిరాలలో దుస్తులు, చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు, సెప్టెంబరు 2: మండలంలోని రావిరాల గ్రామస్థులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. భారీ వర్షాలకు గ్రామం జలమయం కావడంతో సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఇళ్లు కూలిన బాధితులను పరామర్శించారు. గ్రామంలో ప్రతి వాడను సందర్శించి బాధితులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రావిరాలలో చెరువులు నిండి గ్రామంలోకి వరద నీరు రావడంతో ఇళ్లు మునిగిపోయాయన్నారు. చెరువుకు గండిపడి నీరు వెళ్లిపోవడంతో గ్రామస్థులు బతికిబయట పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్థులు ముందుకు వచ్చి గ్రామస్థులకు తక్షణ సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వం తరుపున సహాయం అందజేస్తామని తెలిపారు. నిత్యావసర వస్తువులు, బియ్యం అందించాలని అధికారులకు సూచించారు. ఇళ్లు కూలిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామన్నారు. గొర్రెలు, మేకలు, గేదెలు మృతి చెందిన రైతులకు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. చెరువుకు మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ డేవిడ్, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో బాలరాజు, కాంగ్రెస్ నాయకులు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు విప్ చేయూత

నిత్యావసరాలు అందజేసిన రామచంద్రునాయక్

మరిపెడ రూరల్, సెప్టెంబరు 2: వరద బాధితులకు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ చేయూతనిచ్చారు. సోమవారం మండలంలోని పురుషోత్తమాయగూడెం శివారు సీరాంనాయక్ తండాలో ఇరుక్కుపోయిన వరద బాధితులకు కుటుంబానికి రూ.25కిలోల బియ్యం, పులిహోర ప్యాకెట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలతో ఎ లాంటి ఇబ్బందులకు గురైనా ప్రతీ ఒక్కరిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి భరోసా కల్పిస్తారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పింగిళి వీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, రాంలాల్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు 62 కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ బానోత్ నెహ్రూ, కోశాధికారి మాధవ పెద్ది వెంకటరెడ్డి, అధికారులు సోమ్లానాయక్, తహసీల్దార్, రైతులు పాల్గొన్నారు.



వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్

ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతులను, ఇళ్లు కూలిపోయిన బాధితులను సోమవారం ఎమ్మెల్యే వెళ్లి పరిశీలించి ఓదార్చారు. మండలంలోని నాంచారిమడూరులో సర్వేశ్వర్‌రావు అనే కౌలు రైతు 20ఎకరాల్లో బొప్పాయి తోట సాగు చేస్తుంటే కోత దశలో పూర్తిగా నేలకొరగడంతో పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ఆస్తి నష్టం, పంట నష్టంపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, అశోక్‌రెడ్డి, ధరావత్ సోమన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నాంచారిమడూరులో ధ్వంసమైన బొప్పాయి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

భారీ వర్షంతో ధ్వంసమైన రోడ్లు

- బంధం కుంట వద్ద ఆరంభం కాని రాకపోకలు
- రోడ్లను పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్
- రెండు రోజులుగా బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్‌లేక ఇబ్బందులు



మహబూబాబాద్ ఆర్వోబీ కింద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 2: జిల్లాలో కురిసిన భారీ వర్షం పెద్ద నష్టాన్ని మిగిల్చింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి ఇవ్వకుండా కురిసిన వర్షంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదు కాగా, పట్టణంలోని రోడ్లన్నీ కోతకు గురయ్యాయి. ఆదివారం సాయంత్రం వరకు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టడంతో సోమవారం ఉదయం నుంచి రాకపోకలు కొనసాగుతున్నాయి. నాలుగు వైపులా నీళ్లతో పట్టణం నిండిపోగా పలు రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లా కేంద్రం శివారు మున్నేరు వాగు ఉప్పొంగి రోడ్డుపై నుంచి నీటి వరద ప్రవాహం పోవడంతో హైలెవల్ బ్రిడ్జి సమీపంలో రోడ్డుకు ఒకపక్క కోతకు గురైంది. అక్కడ వాహనాలు కూడా పోలేని స్థితిలో ధ్వంసం కావడంతో యుద్ధ ప్రాతిపదికన సదరు రోడ్డుకు మరమ్మతులు

▸▸ మిగతా 8వ పేజీలో..

శ్రీవారిని దర్శించుకున్న మార్నేని దంపతులు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 2: తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్, అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ దంపతులు దర్శించుకున్నారు. సోమవారం వారు స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2 : చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొం దించాలని సెన్సార్ బోర్డు మెంబర్ ఆకుల నాగేశ్వర్ అన్నారు. సోమవారం బాలసము ద్రంలోని సామాజగన్మోహన్ ఆ కార్యక్ర మాన్ని చేపడుతున్న భారత్ వికాస్ పరిషత్ ఆధ్వ ర్యంలో దేశభక్తి బృందగీ తాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొం దించే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న భారత్ వికాస్ పరిష త్‌ను అభినందించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆహుతుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, సెక్రెటరీ కె. సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

8న టీపీయూఎస్ గురుపూజోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పుర స్కరించుకొని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆధ్వర్యం లో ఈ నెల 8న గురుపూజోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రెండు జిల్లాల ప్రతినిధులు సతీష్, శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. హనుమకొండ బాలసముద్రంలోని సామాజగన్మోహన్ స్మారక భవ నంలో ఆదివారం ఉద యం 10 గంటలకు టీపీయూఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఉపా ధ్యాయులు పాల్గొనాలని వారు కోరారు.

తప్పిపోయిన వృద్ధురాలు

● చేరదీసిన పోలీసులు ● కుటుంబ సభ్యులకు అప్పగింత


వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మడికొండ, సెప్టెంబరు 2: ఇంటి నుంచి బయటకు వచ్చి అడ్రస్ మర్చిపోయిన వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మడికొండకు చెందిన తలగాని సరోజ అనే వృద్ధురాలు సోమవారం ఇంటి నుంచి బయటికి వచ్చింది. వృద్ధురాలు కావడంతో వయసు రీత్యా అడ్రస్ మర్చిపోయి తిరిగి ఇంటికి వెళ్లలేక అక్కడక్కడ తిరుగుతూ ఉంది. ఈ విషయం తెలిసిన పలువురు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ బాధితురాలిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి వివరాలు తెలుసుకుని ఆమె కుమారుడు సంతోష్‌కు అప్పగించారు. ఈసందర్భంగా బాధిత వృద్ధురాలి కుమారుడు సంతోష్ ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సైలు రాజబాబు, దివ్య, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, పోలీసులను అభినందించారు.

6న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2: జిల్లా ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పనా ధికారి సీహెచ్. ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ హైదరాబాద్‌లో వర్చువల్ కేర్, ఎస్ బ్యాంక్ హైదరాబాద్‌లో సీనియర్ ఆఫీసర్, ముత్తూట్ ఫైనాన్స్ హైదరాబాద్, వరంగల్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల ఉద్యోగాలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 22 నుంచి 35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆమె తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

ముగిసిన జిల్లా స్థాయి చెస్ టోర్నీ


రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 2 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలు ముగిశాయి. అండర్-11 బాల బాలికల విభాగంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలల్లో 70 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-11 చెస్ పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ వైశాలి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

-రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు:

- బాలుర విభాగంలో డీ అభినవ్‌సాయి, ఆయుష్, అద్విక్, జితేశ్
- బాలికల విభాగంలో జాన్సీ, వైష్ణవి, అస్మిత, అక్షయ


జనగామ జిల్లా చిలుపూరు మండలం పల్లగుట్టలో కోతకు గురైన రోడ్డు


భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో వరద నీటిలో మునిగిన వరి పొలాలు


వర్ధన్నపేట మండలం ఇల్లంద శివారులో ఆకేరువాగు ఉప్పొంగడంతో కోతకు గురవుతున్న ప్రాంతం

వాన బీభత్సం.. తీరని నష్టం

5వ పేజీ తరువాయి

నుంచి సోమవారం ఉదయం వరకు ఈ దారిని పోలీసులు మూసివేశారు. చిన్నచిన్న వాహనాలనే అనుమతించారు. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేసిన తర్వాత మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు కొనసాగాయి. జంపన్నవాగు, దయ్యాలవాగులో వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది. ఆదివారం తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లో 6కేంద్రాలను ఏర్పాటుచేసి 489 మందిని తరలించారు. సోమవారం మూడు పునరావాస కేంద్రాలను తెరిచి 293 మందికి ఆశ్రయం కల్పించారు. తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ పిడుగుపాటుకు ఒకరు, కాల్వపల్లిలో వరద నీటిలో మునిగి మరో యువకుడు మరణించగా.. శనివారం సాయంత్రం ఇదే మండలం బందాల వద్ద 17మేకలు వరదలో కొట్టుకుపోయాయి. ఇదే మండలంలో వరద ఉధృతికి 16 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అధికారులు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాల ప్రకారం.. 18 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా ఓ ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. నాలుగు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. పంట నష్టంపై వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్నారు. వాగుల తీరంలో వరి చేలలో ఇసుక మేటలు వేయగా ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు మండలాల్లో మిరపనారు దెబ్బతింది. మేడారం వద్ద జంపన్న వాగు ఉధృతి ఆదివారం కంటే సోమవారం కాస్త తగ్గింది.

- హనుమకొండ జిల్లాలో సుమారు రూ.20 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. పూర్తిస్థాయిలో పరిశీలన తర్వాత ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉండవచ్చునని చెబుతున్నారు. సోమవారం హనుమకొండ జిల్లాలో 6.95 సెం.మీ వర్షపాతం నమోదైంది. కానీ శనివారం రాత్రి ఆదివారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా పడిన వర్షంతో రోడ్లు ఎక్కువగా దెబ్బతిన్నాయి. చాలా చోట్ల రోడ్లపై గుంతలు పడ్డాయి. కొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. దీంతో రోడ్లు భవనాల శాఖ అధికారులు ఉదయం జిల్లాలో పర్యటించి రోడ్లను పరిశీలించి సుమారు రూ.10 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఇక జిల్లాలో చిన్నవి పెద్దవి సుమారు 1000 చెరువులు ఉండగా అవన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. పలు చెరువులకు గండ్లు పడగా.. కొన్నిటికి కట్టలు దెబ్బతిన్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు వీటికి తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం చెరువులకు సుమారు రూ. 5 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇక పంథిని, అయినవోలు మండలాల్లో 18విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. మరికొన్ని చోట్ల లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అనేక చోట్ల పొలాల్లోకి నీరు చేరింది. దీంతో వరి, పత్తి, మొక్క జొన్న పంటలకు ఎక్కువ నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.


మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం వద్ద పెద్ద చెరువుకు గండిపడడంతో తెగిపోయిన బీటీరోడ్డు

- వరంగల్ జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, మొత్తం 3,806మంది రైతులు సాగు చేస్తున్న 6,533 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నెక్కొండ మండలంలోని 8 గ్రామాల్లో 2,465మంది రైతుల సాగు చేస్తున్న 1,950 ఎకరాలలో వరి, 2,250 ఎకరాల్లో పత్తి, 410 ఎకరాల్లో మొక్కజొన్న కలిపి 4,610 ఎకరాల్లో పంట నీటమునిగిందని అధికారులు పేర్కొంటున్నారు. చెన్నరావుపేట మండలంలోని 13 గ్రామాలకు చెందిన 1,341 మంది రైతులు సాగు చేస్తున్న 1,008 ఎకరాల వరి, 735 ఎకరాల పత్తి, 180 ఎకరాల మొక్కజొన్న కలిపి 1,923 ఎకరాలలో పంట నీటమునిగిందని అంచనా వేశారు. పలుచోట్ల ముంపు బాధితులను ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీసులు, డీఆర్ఎఫ్ బృందాలు పునరావాస కేంద్రాలకు తరలించారు. వరంగల్ నగరంలో జలమయమైన కాలనీల బాధితులకు పునరావాస కేంద్రాల్లో రెండు రోజుల నుంచి వారికి అన్నపానీయాలు అందిస్తున్నారు. ఆదివారం జలమయమైన పలు రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు తగ్గముఖం పట్టింది. వరంగల్ మండలం పరిధిలో ముంపు కాలనీవాసులను ఆదివారం పునరావాస కేంద్రాలకు తరలించారు. వరంగల్‌లోని మర్వాడీ భవన్‌లో 150 మంది, శుభం గార్డెన్ 50మంది, కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 220 మందికి పునరావాసం కల్పించారు. 19వ డివిజన్ గాంధీనగర్‌లో ఇళ్లలోకి నీరు చేరడంతో మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు చొరవతీసుకుని రెండు రోజుల నుంచి బాధితులకు ఆహారం అందిస్తున్నారు.
- జనగామ జిల్లాలో ఆదివారం కురిసిన వర్షంతో స్వల్ప నష్టం వాటిల్లింది. పలు మండలాల్లో సుమారు 278 ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. వర్షపు నీరు కారణంగా పలు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సోమవారం పర్యటించారు. ఆయా మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి నష్టం అంచనాను పరిశీలించారు. రోడ్లు ధ్వంసమైన చోట్ల తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు చేపట్టారు. వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా అధికారులు పునరుద్ధరించారు. జిల్లాలో 12 చోట్ల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వివిధ మండలాల్లో 6చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు విరిగిపడడంతో జిల్లావ్యాప్తంగా 22 స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం తేలికపాటి వర్షం పడగా 28.2 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గంగారం అలుగువాగు, పోతులవాయి బొర్రవాగు, ఒడిపిలవంచ ఎర్ర వాగు, మల్లారం అలుగు వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎగువన ఉన్న కడెం, శ్రీపాదఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి లక్షలాది క్యూసెక్కుల వరదనీటిని కిందకి వదిలేస్తుండటంతో దామెరకుంట వద్ద గోదావరి, మానేరు నదులు ఉప్పొంగుతున్నాయి. గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగి పరీవాహక ప్రాంతంలోని వరి పొలాలు, పత్తి చేలన్నీ మునిగిపోయాయి. దీంతో పాటు పలు మండలాల్లోని వరి, పత్తి చేలల్లోకి భారీగా వరద నీరు చేరడంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓసీపీలో భారీ వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల్లో 12 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.50 లక్షల ఓబీ వెలికితీత పనులు జరగాల్సి ఉండగా ఇవి స్తంభించిపోయాయి. ఓసీపీలోకి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నారు. అలాగే భూపాలపల్లి సింగరేణి ఏరియాలో భారీ వర్షాలకు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2,3లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది రహదారులు బురదమయం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి నెలకొంది. క్వారీలలో వర్షపు నీరు నిలవడంతో బొగ్గు వెలికి తీయడం సాధ్యపడలేదు. మూడు రోజులలో వర్ష ప్రభావంతో ఓసీ-2,3 ప్రాజెక్ట్ నుంచి సుమారు 17వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిందని అధికారులు తెలిపారు. దీంతో సింగరేణికి సుమారు రూ. 60 కోట్లు నష్టం వచ్చిందని వివరించారు.


ఇంటికన్నె సమీపంలో ముమ్మరంగా జరుగుతున్న రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు

యుద్ధ ప్రాతిపదికన ట్రాక్ మరమ్మతులు

- ఇంటికన్నె వద్ద 8 పొక్లెయినర్లతో వేగంగా పనులు
- పరిశీలించిన రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

కేసముద్రం, సెప్టెంబరు 2 : సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి ట్రాక్ కొట్టుకుపోయిన ప్రాంతంలో మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. ఇంటికన్నె సమీపంలో 418 కిలోమీటరు వద్ద పెద్దమోరీ వరద ఉధృతికి 30 మీటర్ల పొడవున రైల్వే ట్రాక్ ధ్వంసమై పట్టాలు గాలిలో వేలాడుతున్నాయి. ఇదే ప్రాంతంలో అక్కడక్కడ పట్టాల కింద కంకర, మట్టి వరద నీరు కొట్టుకుపోయింది. ఫలితంగా శనివారం రాత్రి నుంచి సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రైల్వే డివిజన్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం నుంచే మరమ్మతు పనులను చేపట్టారు. సోమవారం ఉదయం నాటికి వరద తగ్గుముఖం పట్టడంతో 8 ప్రొక్లెయినర్లతో రైలు కట్టను పునరుద్ధరిస్తున్నారు. ఈ పనులు పగలు, రాత్రి నిరంతరాయంగా కొనసాగేలా రైల్వే శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సోమవారం మరమ్మతు పనులను పరిశీలించారు. మంగళవారం వరకు రైల్వే ట్రాక్ పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కేసముద్రంలో నిలిచిపోయిన సంగమిత్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు చెందిన ప్రయాణికులు సుమారు 6వేల మందిని 76ఆర్టీసీ బస్సుల్లో ఆదివారం అర్ధ రాత్రి కల్లా వరంగల్‌కు తరలించారు. కేసముద్రం రైల్వే స్టేషన్‌లో రాత్రి వేళలో ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్వింటా అన్నం వండించి భోజనం అందించారు.

నెక్కొండ స్టేషన్‌ను సందర్శించిన రైల్వే జీఎం

నెక్కొండ : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం వరంగల్ జిల్లా నెక్కొండ రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. భారీ వర్షాలకు నెక్కొండ-కేసముద్రం రైల్వేస్టేషన్‌ల మధ్య దెబ్బతిన్న రైల్వే ట్రాక్ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో నెక్కొండకు వచ్చిన జీఎం తొలుత నెక్కొండ రైల్వే స్టేషన్‌లో పరిసరాలను పరిశీలించారు. అనంతరం నెక్కొండ నుంచి టవర్ కారులో ట్రాక్ మరమ్మతు జరుగుతున్న కేసముద్రం వెళ్లారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జీఎం వెంట డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్, ఇతర రైల్వే అధికారులు, సిబ్బంది ఉన్నారు.


ఇంటికన్నె వద్ద ట్రాక్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్

మరమ్మతు చేస్తుండగా ఉద్యోగికి గాయాలు..

నెక్కొండ- కేసముద్రం రైల్వే స్టేషన్ల మధ్య దెబ్బతిన్న రైల్వేట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న క్రమంలో సోమవారం నెక్కొండకు చెందిన ఓహెచ్‌ఈ ఉద్యోగి ఆర్.సురేష్ తీవ్ర గాయాలైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. మైలురాయి నెంబరు 418 వద్ద విద్యుత్ లైన్ల మరమ్మతు చేస్తుండగా ఎలక్ట్రికల్ స్ప్రింగ్ కట్‌అయి సురేష్‌కు తగలడంతో గాయాలయ్యాయన్నారు. దీంతో అక్కడే ఉన్న డోర్నకల్ రైల్వే డాక్టర్ ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం కాజీపేట రైల్వే ఆస్పత్రికి తరలించారు.

మత్తడి పోస్తున్న పాకాల


మత్తడి పోస్తున్న పాకాల చెరువు

ఖానాపురం, సెప్టెంబరు 2 : పాకాల సరస్సు చెరువు మత్తడి పోస్తోంది. వర్షాలతో గరిష్ఠ నీటిమట్టాన్ని చేరుకుంది. 30.3 అడుగుల పూర్తి సామర్థ్యం కాగా రెండు రోజులుగా రెండున్నర అడుగుల మేర అలుగు పోస్తోంది. దీంతో అశోక్‌నగర్ శివారులోని లో లెవల్ కాజ్‌వేపై నుంచి పాకాల వాగు ప్రవహించడంతో నర్సంపేట నుంచి పాకాల మీదుగా కొత్తగూడకు రాకపోకలు సోమవారం కూడా నిలిచిపోయాయి.

అధైర్యం వద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

- అధికారులు సేవా దృక్పథంలో పనిచేయాలి
- ముందస్తు ప్రణాళికతో తగ్గిన నష్టం
- ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మహబూబాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో వరద ముంపు ప్రాంతాలను సోమవారం ఆమె పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. జిల్లా కేంద్రంతో పాటు నెల్లికుదురు మండలం రావిరాల, మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం, కేసముద్రం, బయ్యారం మండలాల్లో పర్యటించి దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలను పరిశీలించారు. ఆయా మండలాల్లో ప్రజలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావం, సేవా దృక్పథంలో పనిచేయాలని సూచించారు. జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా తగ్గిందని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, చెరువులు, కుంటలు ప్రమాదకర స్థాయిలో ఉండడంతో అటువైపు ప్రజలు వెళ్లకుండా చూడాలని పోలీసులకు సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఫైమెన్ కమిటీ వేసి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. వర్షాలతో కూలిన ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. నిరంతరాయంగా ప్రజలకు వర్ష సమాచారం చేరవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

తాగునీరు, పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి సీతక్క వివరించారు.


మహబూబాబాద్-మరిపెడ రోడ్డులోని పురుషోత్తమయగూడెం వద్ద ధ్వంసమైన జాతీయ రహదారి

ధ్వంసమైన మానుకోట-మరిపెడ రోడ్డు

పరిశీలించిన మంత్రి సీతక్క


పురుషోత్తమయగూడెం వద్ద ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న మంత్రి ధనసరి సీతక్క

మహబూబాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో జలప్రళయంతో మూడు చోట్ల జాతీయ రహదారులు కోతకు గురయ్యాయి. నష్టం సుమారు రూ.85 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ప్రధానంగా మహబూబాబాద్-మరిపెడ మార్గంలోని పురుషోత్తమయగూడెం హైలెవల్ వంతెనకు మానుకోట వైపు జాతీయ రహదారి 365 ఒక కిలోమీటర్ అప్రోచ్ రోడ్డు కిలోమీటర్ మేర కొట్టుకుపోయింది. నష్టం రూ.10 కోట్ల మేరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోపక్క మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం వెళ్లే జాతీయ రహదారిలోని ముల్కలపల్లి హైలెవల్ వంతెన 8 పిల్లర్ల పైన స్లాబ్ కొట్టుకుపోయింది. నష్టం సుమారు రూ.70 కోట్ల వరకు ఉంటుందని అంచనా కడుతున్నారు. నెల్లికుదురు మండలంలోని మరో జాతీయ రహదారిపై కొట్టుకుపోయిన రోడ్డు నష్టం రూ.5 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. సమాచారం అందుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క స్వయంగా జిల్లాలో సోమవారం అధికారులతో కలిసి సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి పర్యటన సాగిందిలా..

మంత్రి సీతక్క మహబూబాబాద్ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో సోమవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత జిల్లా కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన ఆమె మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలో ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో వరద బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కేసముద్రం మండలకేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్, సంతోష్‌నగర్, బయ్యారం మండలంలోని పాకాల ఏరు, పందిపంపుల వాగు, సుద్దరేవువాగు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. రాంచంద్రాపురంలో వర్షానికి కూలిన ఇంటి యజమానురాలికి ఆర్థిక సాయం అందించారు. తొలుత సొసైటీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారంపై వినతి పత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, ఆర్డీవో అలివేలు, కాంగ్రెస్ నాయకులు సోమేష్, రామ్మూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంరెడ్డి, యాదవరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది పనితీరు భేష్

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- విరిగిన విద్యుత్ స్తంభాలు, సబ్‌స్టేషన్ల పరిశీలన


మహబూబాబాద్ మున్నేరు వాగు వద్ద విరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి


మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 2: భారీ వర్షాలు సృష్టించిన విధ్వంస సమయంలోనూ రాత్రి, పగలు శ్రమించి విద్యుత్ సిబ్బంది పని చేయడం భేష్ అని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా జమాండ్లపల్లి, బయ్యారం, గుండ్రాతి మడుగు వద్ద మున్నేరు, పాకాల, ఆకేరు, పాలేరు వాగుల వద్ద వివిధ ప్రదేశాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఆకేరు, పాలేరు, పాకాలవాగు ప రిసర ప్రాంతాల్లో నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. అలాగే 33/11కేవీ విద్యుత్ స్తంభాల స్థానంలో శాశ్వత పరిష్కార టవర్ల ప్రతిపాదనను పంపాలన్నారు. దాదాపు 700స్తంభాలు, 106 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని తెలిపారు. సుమారు రూ.35లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బయ్యారం, కొత్తపేట సెక్షన్ పరిధిలోని బ్రిడ్జి కింద మునిగిన స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఎంత వరద వచ్చినా నీట మునగకుండా ఉండేందుకు ట్రాన్స్‌ఫార్మర్లకు గద్దెలను నిర్మించాలన్నారు. గుండ్రాతి మడుగు ఫీడర్ పరిధిలో విరిగిన స్తంభాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. త్వరితగతిన పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. గూడూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించి పునఃనిర్మాణానికి ప్రతిపాదనలను పంపాలన్నారు. మరిపెడ మండలం ఉల్లెపల్లి సబ్‌స్టేషన్‌ను చార్జ్ చేశామన్నారు. పట్టణ పరిధి, గ్రామాల్లో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట విద్యుత్ ఎస్ఈ నరేష్, డివిజనల్ ఇంజనీర్లు పి.విజయ్, సునిత, ఏడీఈలు కవిత, ప్రశాంత్, ఏఈలు సంగీత, నవ్య, సుమన్, భోజ్యా నాయక్ ఉన్నారు.

ఆకేరు వాగులో గల్లంతైన మోతీలాల్ మృతదేహం లభ్యం


మోతీలాల్ మృతదేహం

మరిపెడ రూరల్, సెప్టెంబరు 2: ఖమ్మం జిల్లా గేట్‌కారేపల్లి గంగారం తండాకు చెందిన తండ్రి, కూతురు నునావత్ మోతీలాల్(60), నూనావత్ అశ్విని కారులో హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఆదివారం తెల్లవారుజామున మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం వద్ద ఉన్న ఆకేరు వాగు ఉధృతిలో గల్లంతైన విషయం తెలిసిందే. వాగు ఉధృతి తగ్గాక బాల్ని ధర్మారం శివారు పామాయిల్ తోటలో నూనావత్ అశ్విని మృతదేహం లభించింది. ఇక మోతీలాల్ మృతదేహం ఆకేరు వాగులోని కిలోమీటరు పరిధిలో సోమవారం లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

విజయవాడ వరదల్లో మహాముత్తారం మండల వాసి గల్లంతు


లక్ష్మీరాజు (ఫైల్)

మహాముత్తారం, సెప్టెంబరు2: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో సంభవించిన వరదల్లో భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలానికి చెందిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్లపల్లికి చెందిన బీసుల లక్ష్మీరాజు(19) ఇదే గ్రామానికి చెందిన మరో ఐదుగురు యువకులతో కలిసి విజయవాడలోని ఓ ఫ్లెక్సీ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. విజయవాడకు పది కిలో మీటర్ల దూరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి ఆదివారం సహచరులతో వెళ్లాడు. వాగు దాటుతుండగా లక్ష్మీరాజుతోపాటు విజయవాడకు చెందిన మరో యువకుడు గల్లంతయ్యారు. లక్ష్మీరాజు గల్లంతైన విషయాన్ని అతడి యజమాని ఫోన్ ద్వారా కుటుంబ సభ్యుల కు సోమవారం తెలియజేశాడు. ఈ నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబును గ్రామస్థులు కలిశారు. గాలింపు చర్యలు ముమ్మరం చేసేలా అక్కడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని కోరారు.

మా ఇళ్లను చూడండి

▸ కేసముద్రం సంతోష్‌నగర్ వాసుల ఆవేదన

▸ మంత్రి సీతక్క కాన్వాయ్ అడ్డగింతకు ప్రయత్నం


కేసముద్రంలో సీతక్క కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిని తొలగిస్తున్న పోలీసులు

కేసముద్రం, సెప్టెంబరు 2: వరద నీటిలో మునిగిన తమ ఇళ్లను చూడాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్ సంతోష్ నగర్ కాలనీ వాసులు పలువురు సోమవారం మంత్రి సీతక్క కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా మంత్రి సీతక్క సోమవారం సంతోష్‌నగర్ కాలనీ కట్టలో ఒక వైపున ఉన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం వాహనంలో తిరిగి వెళుతుండగా కట్టకు మరోవైపున ఉన్న పలువురు గిరిజనులు ఆమె కాన్వాయ్ వద్దకు చేరుకున్నారు. తమ ఇళ్లను చూడాలంటూ అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు స్పందించి అడ్డుగా ఉన్నవారిని పక్కకు జరపడంతో మంత్రి కాన్వాయ్‌లోని వాహనాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

కొత్తగూడలో 30 పడకల ఆస్పత్రి నిర్మించాలి

▸ ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానాను కోరిన మంత్రి సీతక్క

కొత్తగూడ, సెప్టెంబరు 2: కొత్తగూడలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు కృషి చేస్తున్నామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆగస్టు 30న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన 'బెడ్‌లు సరిపోక రోగుల ఇక్కట్లు' అనే కథనంపై స్పందించిన మంత్రి సీతక్క కొత్తగూడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి 30 పడకల ఆస్పత్రి నిర్మిచేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానాను ఫోన్‌లో కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల వలన ఎటువంటి నష్టం జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కొత్తగూడలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కొత్తగూడ, గంగారం మండలాల్లో మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించాలని, పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తంగా ఉంచాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఏ అధికారి, సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపించవద్దన్నారు.

గంగారం మండలంలో మంత్రి సీతక్క పర్యటన

గంగారం (కొత్తగూడ): గంగారం మండలంలో సోమవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పర్యటించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించి వంటలను రుచి చూశారు. వసతి గృహంలోని గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్‌లో కూలిన గోడను పరిశీలించారు. నూతన గోడలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పీవో చిత్రమిశ్రాను ఫోన్‌లో ఆదేశించారు. చల్లా నారాయణ రెడ్డి, గంగారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, కొత్తగూడ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, మాజీ జడ్పీటీసీ ఈసం రమ, మాజీ ఎంపీపీ సరోజన జగ్గారావు పాల్గొన్నారు.

నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం

▸ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్

డోర్నకల్, సెప్టెంబరు 2: భారీ వర్షాలతో నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో ఆకేరు వాగు వద్ద దెబ్బతిన్న ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో వరద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఆకేరు వాగుకు కనివినీ ఎరుగని స్థాయిలో వరద రావడంతో నష్టం జరిగిందన్నారు.

పట్టణంలో వైఎస్సార్ వర్ధంతి

▸ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి సీతక్క


పట్టణంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 2: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన మహనీయులు వైఎస్సార్ అని కొనియాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమా, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, చుక్కల ఉదయ్ చందర్, బండారు వెంకన్న, ఆరెందుల వెంకటేశ్వర్లు, పింగ్రాల రాందాసు పాల్గొన్నారు.

వరద బీభత్సం

▸ జిల్లాలో తెగిన చెరువులు, రోడ్లు
▸ కొట్టుకుపోయిన పంటలు
▸ పొలాల్లో ఇసుక మేటలు
▸ పలుచోట్ల కూలిపోయిన ఇళ్లు
▸ భారీ వర్షాలతో తేరుకోని ప్రజలు


దంతాలపల్లి మండలం దాట్లలో చిన్నచెరువుకు గండిపడిన దృశ్యం

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 2 : జిల్లాలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరద బీభత్సం సృష్టించింది. ప్రజలు, రైతులను అల్లకల్లోలం చేసింది. పలుచోట్ల పంట పొలాలు కొట్టుకుపోగా, మరికొన్ని చోట్ల ఇసుక మేటలు వేశాయి. అనేక చోట్ల వాగులపై వంతెనలు, బీటీరోడ్లు, అప్రోచ్ రోడ్లు ధ్వంసం కాగా, అనేక చెరువుల కట్టలు తెగిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రాకపోకలు సైతం బంద్ అయ్యాయి.

తెగిన 53 చెరువులు..

మహబూబాబాద్ జిల్లాలో 1,590 చెరువులు ఉండగా భారీ వర్షాలకు 53 చెరువుల కట్టలు తెగిపోయాయి. పాలేరు, ఆకేరు వాగులపై మూడు చెక్ డ్యాంలు కొట్టుకుపోగా, వరద ఉధృతి తగ్గితే మరికొన్ని బయటపడే అవకాశం ఉంది. మహబూబాబాద్‌లో 7 చెరువులు, గూడూరులో 2, చిన్నగూడూరులో 6, దంతాలపల్లిలో 5, కురవిలో 3, నర్సింహులపేటలో 5, మరిపెడలో 9, కేసముద్రంలో 4, ఇనుగుర్తిలో 3, నెల్లికుదురులో 5 చెరువులు తెగిపోయాయని నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. అయితే ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో అనేక రోడ్లు తెగిపోయాయి. మరికొన్ని కొట్టుకుపోయాయి. జిల్లా వ్యాప్తంగా పలుప్రాంతాల్లో 15 రోడ్లు దెబ్బతిన్నాయి.

జిల్లాలో వరద బీభత్సం ఇలా..

మహబూబాబాద్ మండలం వీఎస్ లక్ష్మీపురం వద్ద పెద్ద చెరువుకు గండి పడడంతో బీటీరోడ్డు కొట్టుకుపోయింది. జంగిలిగొండ-వీఎస్ లక్ష్మీపురం గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. రాళ్లవాగులో ఆదివారం రాత్రి కొట్టుకుపోయిన డీసీఎం వ్యాన్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన నాగభూషణం ఆచూకీ లభించలేదు.

• డోర్నకల్ మండలంలో సుమారు 200 ఎకరాల్లో వరి పంట పూర్తిగా కొట్టుకుపోయింది. ముల్కలపల్లి వద్ద ఆకేరుపై ఉన్న 365/ఏ జాతీయ రహదారి వరద ధాటికి కొట్టుకుపోయింది. సోమవారం నేషనల్ హైవే ఈఈ యుగంధర్, ఇతర అధికారులు పరిశీలించారు. వరద ధాటికి హెచ్‌పీ పెట్రోల్ పంపు ధ్వంసమైంది. వాగు పక్కనే పార్కింగ్ చేసి ఉన్న రెండు జేసీబీలు, మూడు ట్రాక్టర్లు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. నర్సరీలోని మొక్కలు కొట్టుకుపోయాయి. ముల్కలపల్లి-తిర్మలాయపాలెం మధ్య ఉన్న అప్రోచ్ రోడ్డు రెండు దిక్కులా కొట్టుకుపోయింది. దాంతో ఆ రహదారిలో రాకపోకలు బంద్ అయ్యాయి. ఉయ్యాలవాడ క్రాస్‌రోడ్డు మున్నేరు వాగు బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురైంది. వెన్నారం చెరువు అలుగు ఉధృతికి 50 ఎకరాల వరి పంటలో ఇసుక మేటలు వేయగా మిగతా పంట కొట్టుకుపోయింది. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసమయ్యాయి.

• చిన్నగూడూరులో ఆకేరు వాగు పొంగి ప్రవహించడంతో గంగమ్మతల్లి ఆలయంలో ఉన్న విగ్రహం కొట్టుకుపోయింది. దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయాధికారి భాస్కర్ పరిశీలించారు. ఉగ్గంపల్లి బ్రిడ్జికి ఆనుకుని రోడ్డు మొత్తం తెగిపోయింది.

• బయ్యారంలోని అనేక పొలాలు కొట్టుకుపోగా, మరికొన్ని పొలాల్లో ఇసుక మేటలు వెలిశాయి. వట్టి వాగు, సుద్దరేవు వాగుల్లో నీటి ప్రవాహం తగ్గకపోవడంతో సోమవారం రాకపోకలు బంద్ అయ్యాయి.

• గార్లలో రాంపురంవద్ద వాగు ఉధృతంగా కొనసాగుతుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి.

• దంతాలపల్లిలో ఆగపేట, దొనకొండ, వేములపల్లి, దాట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. పాలేరు వాగు పక్కన పార్కింగ్ చేసిన ట్రాక్టర్, ఆటో వరద ఉధృతికి కొట్టుకుపోయాయి.

• గూడూరులో దెబ్బతిన్న మొక్కజొన్న, ఇతర పంటలను జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల క్షేత్రస్థాయిలో తిరుగుతూ పరిశీలించారు. రైతులకు తగిన సూచనలు చేశారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి మాలిక్ ఉన్నారు. దొరవారి తిమ్మాపురంలో మూడ్రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారంలో ఉంది. పాకాల వాగు ఉధృతి తగ్గకపోవడంతో రాకపోకలు సాగడం లేదు.

• కురవిలో ముత్యాలమ్మకుంట వరద ధాటికి రోడ్డు తెగిపోయింది. మొగిలిచర్ల-కురవి మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. చాలా గ్రామాల్లో మిర్చి, వరి పంటలు దెబ్బతిన్నాయి. నేరడలో ఐదు, కురవిలో రెండు ఇళ్లు కూలిపోయాయి.

• కేసముద్రంలో వెంకటగిరి చెరువు వద్ద రోడ్డు ధ్వంసమైంది. ఇంటికన్నె సమీపంలోని పెద్దమోరి తండా వద్ద వరద తాకిడికి కొట్టుకుపోయిన రైల్వేలైన్‌ను రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన నడుస్తున్న పనులను పరిశీలించారు. వరంగల్-కేసముద్రం మధ్య రైళ్లు, బస్సులు నడవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అర్పనపల్లి వద్ద వట్టివాగు ఉధృతి తగ్గింది.

• కొత్తగూడలో వాగుల ఉధృతి తగ్గింది. రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి. మొక్కజొన్న పంటలు నేల వాలాయి.

• మరిపెడ రూరల్ ప్రాంతంలోని పాలేరు, ఆకేరు పరివాహక ప్రాంతాల్లోని మిర్చి, పత్తి, వరి పంటలకు భారీ మొత్తంలో నష్టం జరిగింది. పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగు బ్రిడ్జి కూలిపోయింది. దాంతో మహబూబాబాద్-మరిపెడకు రాకపోకలు బంద్ అయ్యాయి.

• నర్సింహులపేట మండలంలో వరి, పత్తి పంటల్లో ఇసుక మేటలు వెలిశాయి. కొమ్ములవంచ, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెంలో రోడ్లు పూర్తిగా తెగిపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి.

• నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి సమీపంలో వాగు ఉధృతి ఇప్పుడిప్పుడే తగ్గుతుంది. వరి, ఇతర పంటలకు నష్టం వాటిల్లింది.

• సీరోలు మండలంలోని కొత్తూరు(సి) గ్రామానికి వెళ్లే రహదారి కొట్టుకుపోవడంతో ఎస్సై నగేష్ కంకర, మట్టితో మరమ్మతులు చేయించారు.

• తొర్రూరు మండలం అమ్మాపురం-బత్తులతండా రహదారి కొట్టుకుపోయింది. తొర్రూరు-మహబూబాబాద్, తొర్రూరు-నర్సంపేటకు రాకపోకలు బంద్ అయ్యాయి. నాంచారిమడూరులో 20 ఎకరాల బొప్పాయితోట ధ్వంసమైంది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పరిశీలించారు. వెంకటపురం వాగులో గల్లంతైన చిన్నసోమయ్య మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికితీశారు. మండలంలో ఆరు ఇళ్లు కూలిపోయాయి. పంటలకు కొంతమేర నష్టం వాటిల్లింది.


తొర్రూరు మండలం అమ్మాపురం వద్ద దెబ్బతిన్న బీటీరోడ్డు


దోర్నకల్ మండలంలో మున్నేరు వాగులో కొట్టుకుపోయిన ట్రాక్టర్‌ను వెలికితీస్తున్న రైతులు


గూడూరులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న డీఏవో

జిల్లాలో 630.4 మి.మీ వర్షపాతం

మహబూబాబాద్ జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 630.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 39.4 మి.మీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. కొత్తగూడలో 18.4, గంగారంలో 17.2, బయ్యారంలో 14.2, గార్లలో 25.8, డోర్నకల్‌లో 16.2, కురవిలో 88.4, కేసముద్రంలో 46.8, గూడూరులో 77.2, కురవిలో 88.4, మహబూబాబాద్‌లో 41.2, నెల్లికుదురులో 45.2, నర్సింహులపేటలో 49.8, చిన్నగూడూరులో 35.4, మరిపెడలో 38.6, దంతాలపల్లిలో 30.2, తొర్రూరులో 42.6, పెద్దవంగరలో 43.2 మి.మీ వర్షం కురిసింది.

పోలీసుల సహాయక చర్యలను అభినందించిన డీజీపీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 2 : భారీ వర్షాల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది చేసిన సహాయక చర్యలను రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందిస్తూ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జిల్లాలో కురిసిన భారీ వర్షంతో కేసముద్రం మండలం ఇంటికన్నె, తాళ్లపూసపల్లి వద్ద ట్రాక్ కొట్టుకుపోవడంతో పలు రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలిచిపోయాయి.ఈక్రమంలో ప్రయాణికులను పోలీసులు వివిధ వాహనాల ద్వారా కాజీపేట రైల్వే స్టేషన్‌కు తరలించగా అక్కడి నుంచి వారి గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. దీనికి తోడు ప్రయాణికులకు అల్పాహారం, భోజనం, తాగునీరు అందించిన సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, పోలీసు అధికారులు, సిబ్బందిని డీజీపీ అభినందించారు.

మునిసిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు చేయాలి

▸ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 2: మహబూబాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి పట్టణంలో తీవ్రనష్టం జరిగిందని, డ్రైనేజీల నిర్మాణాలు, రోడ్ల మరమ్మతులు, నాలాల ఏర్పాటుకు తక్షణమే ప్రభుత్వం రూ. 15 కోట్ల నిధులు కేటాయించి మంజూరి చేయాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి కోరారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా మునిసిపల్ పరిధి 36 వార్డుల్లో అంతర్గతరోడ్లు, డ్రైనేజీలు, రోడ్లు, కల్వర్టులు, పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని చెప్పారు. నిజాం చెరువు, బంధం కుంట మత్తడి వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానుకోట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో మానుకోటలో జరిగిన నష్టాన్ని స్థానిక ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరికి కృషి చేయాలని కోరారు. తక్షణమే రూ.15 కోట్లు మంజూరి చేసి మానుకోట పట్టణాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఫ్లోర్ లీడర్లు చిట్యాల జనార్ధన్, సూర్నపు సోమయ్య, బి.అజయ్‌సారధిరెడ్డి పాల్గొన్నారు.

భారీ వర్షంతో ధ్వంసమైన రోడ్లు


మహబూబాబాద్ మున్నేరు వాగు వద్ద దెబ్బతిన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్న అధికారులు


మహబూబాబాద్-కురవి రోడ్‌లోని ఆర్వోబీ కింద భాగంలోని దెబ్బతిన్న రోడ్డు

(5వ పేజీ తరువాయి)

చేపట్టారు. పట్టణ నడిబొడ్డున ఉన్న బంధం కుంట ఉధృతితో అక్కడ కూడా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో మధ్య గేట్ ఆర్యూబీ నుంచి కురవి రోడ్‌కు వెళ్లే మార్గంలో రాకపోకలను నిలిపి వేశారు. దానికి సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) కింది భాగంలో కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డు మార్గం సైతం దెబ్బతింది. ఆ ప్రాంతంలో ఇంకా నీటి ప్రవాహం కొనసాగుతోంది. మోకాళ్లలోతు నీరు పోతుండడంతో అందులో నుంచి వాహనాలు పోతున్నాయి. ఇక శివారు కాలనీల పరిస్థితి దయనీయంగా మారింది. ఇంకా కొన్ని కాలనీలు జల దిగ్బంధంలో నుంచి బయట పడలేదు. మొత్తానికి జిల్లాలో కురిసిన భారీ వర్షంతో ఎన్నడూ లేని విధంగా రోడ్లు దెబ్బతిన్నాయి. మహబూబాబాద్ పట్టణంలో వర్ష బీభత్సంతో దెబ్బతిన్న రోడ్లను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న పాల్గొన్నారు.

కాగా, జిల్లా కేంద్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 2: సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన డీసీఎం వ్యాన్‌డ్రైవర్ ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికారెడ్డి సోమవారం తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొంపల్లి గ్రామం నుంచి కేసముద్రం మీదుగా మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో ఆదివారం రాత్రి డ్రైవర్ నిరక్ష్యం, అజాగ్రత్త వల్ల ఈదులపూసపల్లి రాళ్లవాగులో డీసీఎం కొట్టుకుపోయింది. డీసీఎంలో ఐదుగురు వ్యక్తులు ఉండగా నలుగురిని హైదరాబాద్ ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు రక్షించగా, ఒకరు గల్లంతయ్యాయి. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ డ్రైవర్ ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


నర్సయ్య మృతదేహం

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 2 : మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు వెంకటాపురం బర్ల చెరువులో గల్లంతైన వ్యక్తి గుండాల చిన్న నర్సయ్య (52) మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. ఎస్సై జి.ఉపేందర్ తెలిపిన కథనం ప్రకారం.. వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాల చిన్న నర్సయ్య తన అన్నతో కలిసి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లివస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతైనాడు. దీంతో రెండు రోజుల పాటు గ్రామస్థులు, పోలీసు సిబ్బంది గాలింపులు చర్యలు చేపట్టగా ఉదయం లభ్యమైనట్లు తెలిపారు. మృతుడికి భార్య సత్యవతి, కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢసంతాపం వ్యక్తం చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్లాడ సీతారామచంద్ర స్వామి ఆలయంలో చోరీ

దంతాలపల్లి, సెప్టెంబరు 2 : డివిజన్‌లోనే ప్రసిద్ధి గాంచిన పూరాతన దేశాలయం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయం ప్రధాన ద్వారం తాళంను పగళగొట్టి సీతమ్మ వారి బంగారు (రెండు) పుస్తెలను దొంగలించారు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో దైవశంభుతులుగా ప్రసిద్ధి చెందిన సీత, రామ, లక్ష్మణుడి విగ్రహాలున్నాయి, సీతమ్మ మెడలో నుంచి రెండు పుస్తెలు (బంగారం-సుమారు 2 గ్రాములు) రాముడు, లక్ష్మణులకు చెందిన వెండి జంజాలు సైతం చోరీకి గురైంది. సోమవారం తెల్లవారు జామున ఆలయ పూజారి వేణుగోపాల్ ఆలయానికి పూజ చేసేందుకు రావడంతో ఆలయ ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉండడంతో ఆయన స్థానికులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్సై చందర్ ఆధ్వర్యంలో జిల్లా క్లూస్ టీం వేలిముద్ర నమునాల సేకరణ చేశారు. రెండు పుస్తెలు, వెండి జంజాలు సుమారు రూ.20వేల పైచిలుకు ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు. దొంగలు తమ వెంట తెచ్చిన గడ్డపారను సైతం ఆలయంలోనే వదిలివెళ్లారు. దీంతో స్థానికులే ఈ దొంగతానికి పల్పడ్డారా లేదా బయటి వ్యక్తుల ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా, సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు గ్రామ పెద్దలను సూచించారు.

బీఆర్ఎస్ సీనియర్ నేత సేట్యా మృతి

గూడూరు, సెప్టెంబరు 2: గూడూరు మండలం పాటిమీది తండాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాదావత్ సేట్యా(62) సోమవారం మృతి చెందాడు. కొద్ది కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 2001 నుంచి టీఆర్ఎస్,నేటి బీఆర్ఎస్ వరకు పార్టీలో పని చేశారు. సేట్యా మృతదేహాన్ని మాజీ సర్పంచ్ బానోత్ రాధనర్సింహానాయక్ సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సీహెచ్‌సీని తనిఖీ చేసిన అధికారులు

గూడూరు, సెప్టెంబరు 2: గూడూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) సోమవారం ఎంపీడీవో వీరస్వామి, తహసీల్దార్ కోమల, ఎంపీవో సత్యనారాయణ సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలను అందించాలని సూచించారు. డాక్టర్లు, వైద్యసిబ్బంది సేవలు మెరుగ్గా ఉన్నాయని వాటి ని మరింత మెరుగు పర్చాలని సూచించారు.

పంటలను పరిశీలించిన అధికారులు

కొత్తగూడ, సెప్టెంబరు 2 : మండలంలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నేల వాలిన, నీటమునిగిన పంటలను మండల వ్యవసాయశాఖ అధికారి ఉదయ్, ఏఈవోలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ఉదయ్ మాట్లాడుతూ మండలంలో వరి 1924 ఎకరాలు నీట మునిగిందని, మొక్కజొన్న 2263 ఎకరాల్లో నేల వాలిందని, పత్తి 232 ఎకరాల్లో నీట మునిగిందని పేర్కొన్నారు. ప్రాథమిక నివేదికను అధికారులకు పంపించామన్నారు. గ్రామాల్లో రైతుల వారీగా సర్వే చేసి తుది నివేదికను రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజు, వినోద్ పాల్గొన్నారు.

బీముడి పాదంలో పర్యాటకుల సందడి

గూడూరు, సెప్టెంబరు 2: గూడూరు మండలం సీతానాగారం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో ఉన్న బీముని పాదం జలపాతం వద్ద సోమవారం పర్యాటకులు సందడి చేశారు. గత నాలుగు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కొండలపై 70ఫీట్ల ఎత్తు నుంచి వాటర్ ఫాల్స్ ఉధృతం ప్రవహిస్తున్నాయి. ఈజలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి

▸ సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 2: గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ప్రజానీకాన్ని, రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సోమవారం అల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... భారీ వర్షంతో అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయిన మానుకోట జిల్లాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో నిధులు మంజూరి చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలతో పంటలు దెబ్బతిని అన్నదాతలు ఆర్థికంగా నష్టపోయారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా రోడ్లు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి బాగు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకుడు సూర్నపు సోమయ్య, పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, సమ్మెట రాజమౌళి, యాకన్న, హేమానాయక్, రావుల రాజు పాల్గొన్నారు.


వరద ఉధృతికి కొట్టుకొచ్చిన మృతదేహం

బయ్యారం, సెప్టెంబరు 2: పాకాల ఏరు వరద ప్రవాహంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం కొట్టుకొచ్చింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు బయ్యారం పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తున్న సంగతి తెలిసిందే. వాగుకు రెండు వైపులా అర కిలోమీటరు మేర వరద ప్రవాహం పోటెత్తింది. వరద ప్రవాహంతో ఏటి ఒడ్డున గల కొల్లి హరినాథ్‌బాబు అనే రైతు జామాయిల్ తోటలోకి మృతదేహం కొట్టుకొచ్చింది. చర్మం ఊడిపోయి మృతదేహం తెల్లగా కనిపిస్తుంది. కాగా, మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు.

సకాలంలో వైద్యం అందక వ్యక్తి మృతి

డోర్నకల్, సెప్టెంబరు 2 : అనారోగ్యానికి గురైన వ్యక్తికి సకాలంలో వైద్యం అందక మృతి చెందిన సంఘటన డోర్నకల్ మండలం ఉయ్యాలవాడలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన ప్రకారం.. వెల్పుల రామకృష్ణ(45) అనే వ్యక్తి రెండ్రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆదివారం పరిస్థితి విషమించడంతో బంధువులు ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకువెళ్తున్నారు. ఈ క్రమంలో వరద ఉధృతికి రోడ్లు దిగ్బంధం కావడంతో సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేకపోగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ధ్వంసమైన రహదారులు.. స్తంభించిన రాకపోకలు


ఉగ్గంపల్లి ఆకేరు వద్ద నిచ్చెన సాయంతో వెళ్తున్న ప్రజలు

చిన్నగూడూరు, సెప్టెంబరు 2 : మండలంలోని చిన్నగూడూరు, ఉగ్గంపల్లి, పగిడిపల్లి, విస్సంపల్లి, జయ్యారం, మన్నెగూడెం, మంగోలిగూడెం గ్రామాల రహదారులు భారీ వర్షాల వరద ఉధృతికి ధ్వంసమవ్వడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆకేరు ఉధృతికి గంగమ్మ ఆలయం పూర్తిగా దెబ్బతింది. గంగమ్మ విగ్రహం, ఆకేరు ప్రాంతంలో వ్యవసాయం చేసే రైతుల మోటార్లు, విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోయాయి. అత్యవసర ప్రయాణం చేయాల్సిన అవసరం ఉన్న ప్రయాణికులు అవస్థలుపడుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి : ఏడీఏ

తొర్రూరు, సెప్టెంబరు 2 : రైతు పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయచంద్ర అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లులు ఇవ్వాలని, బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలుచేస్తే కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. తప్పనిసరిగా రైతులు ఆధార్ కార్డులు తీసుకువచ్చి కొనుగోలు చేపట్టాలని సూచించారు. వ్యాపారులు స్టాక్ వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలని, యూరియాను అధిక ధరలకు విక్రయించినా షాప్‌ల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మురళి, భరత్ చంద్ర పాల్గొన్నారు.